ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



చిలుకానగర్‌లో హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు

ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలోని చిల్కేశ్వర్ గుట్టపై ఉన్న హనుమాన్ ఆలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఎన్‌జీఆర్ఐ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో...

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పలు దేవాలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతుడికి అభిషేకాలు, పలు ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, చర్లపల్లి డివిజన్లలో...

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, చర్లపల్లి డివిజన్లలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ర్యాలీలు నిర్వహించారు. ఇందిరానగర్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.



గౌతంనగర్ మల్లన్న ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు

మల్లాపూర్ డివిజన్‌లో...

మల్లాపూర్: హనుమాన్ జయంతిని మల్లాపూర్ డివిజన్‌లోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెహ్రూనగర్ హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. హెచ్‌ఎంటీనగర్‌లో హనుమాన్ ఆలయం వద్ద వాహనదారులకు, పాదచారులకు జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెల్ల ప్రవీణ్, శ్రీనివాస్, గణేష రాంచందర్, సబిత, రఘు, మామిడాల సంతోష్‌రెడ్డి, రాజారెడ్డి, రమాకాంత్, కిషోర్ రెడ్డి, జంగాల గురు, విజయ్‌సింగ్, రవి, ఆరెల్ల శ్రీధర్, సాయిచంద్, చరణ్, శ్రీకాంత్ అక్షంత్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో..

మల్కాజిగిరి: హనుమత్ జయంతి మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లోని పలు దేవాలయాల్లో ఘనంగా జరిగింది. ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలోని సంకట విమోచన ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు తులసి రమణాచార్యులు లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు.



అల్వాల్ ఆనంద్‌రావునగర్‌లో హనుమాన్ జయంతి వేడుకలు

ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు వేణుగోపాలాచార్యులు, క్లర్క్ సుధాకర్ భక్తులు పాల్గొన్నారు. మారుతీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు శ్యామ్ ప్రసాద్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. ఆనంద్‌బాగ్ కనక రాజుతోట(శంకర విద్యాపీఠం)లో హనుమత్ పీఠం వ్యవస్థాపకులు ఘంటసాల సత్య సాయి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: మరమ్మతుల కారణంగా అధికారుల సూచన మేరకు ఆదివారం పలు ఫీడర్ల పరిధిలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు చర్లపల్లి సబ్‌స్టేషన్–2 ఏఈ ఎం.పృథ్వీరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెర్కో, మిక్ ఎలక్ట్రానిక్స్ 11కేవీ ఫీడర్ల పరిధిలోని ఫేస్–2 ఏరియా సెక్టార్–1, ఫేస్–2 ఏరియా సెక్టార్–2 పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, కృప, పాలిమర్ ఇండస్ట్రీస్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

చర్లపల్లి సబ్‌స్టేషన్–1 పరిధిలో..

చర్లపల్లి సబ్‌స్టేషన్ –1 పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు శనివారం ఏఈ రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. భగవతి గ్రానైట్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఐడీఏ ఫేస్–5 ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, నవోదయ ఇండస్ట్రియల్, ఐకాం 11 కేవీ ఫీడర్ల పరిధిలోని నవోదయ ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు ఫేస్–1 ఏరియాలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గాయిత్రీ స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్ గురువు డా.గాయిత్రీ శేఖర్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. వినాయక కౌతం, రామ కోదండరామ, శ్రీమన్నారాయణ, పలుకే బంగారామాయనే తదితర అంశాలను కళాకారులు నిహారిక, హిరణ్య ఈషా, లక్ష్మీ ప్రియా, సహస్ర తదితరలు ప్రదర్శించి మెప్పించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మేడిపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ మల్లికార్జుననగర్ కాలనీలో బెంగళూరుకు చెందిన సత్యనారాయణ పటేల్ అనే వ్యక్తి ఓ గదిని అద్దెకు తీసుకుని అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం ఆయన అద్దెకు తీసుకున్న గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గది తలుపులను పగలగొట్టారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గమనించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్న మేడిపల్లి పోలీసులు మహిళ ఎవరు అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక చేయూత



స్పీకర్ చేతులమీదుగా ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నెహ్రూనగర్‌కు చెందిన మెడిసిన్ విద్యార్థికి బీఎల్ఆర్ ట్రస్ట్ ఆర్థిక చేయూతను అందించడం అభినందనీయం అని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. నెహ్రూనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సింగ్‌రావు కూతురు గీతాంజలి ఖమ్మం మమత మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న నర్సింగ్‌రావు కూతురును మెడిసిన్ చదివించేందుకు ఎంతో కష్టపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ ట్రస్ట్ ఫౌండర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థికి ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం మూడో ఏడాది చదువుతున్న గీతాంజలికి శనివారం ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్ల కోర్సుకు తానే ఫీజు చెల్లిస్తానని ముందుకు రావడం గొప్ప విషయమని స్పీకర్ కొనియాడారు.

మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్ ప్రారంభం



అల్వాల్‌లో వెహికల్స్‌ను ప్రారంభిస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్‌ను శనివారం అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు రంజిల్‌రెడ్డి, కార్తీక్, ఏఈలు లక్ష్మి, రవళి, అరుణ్, మున్సిపల్ అధికారి లాలిష్, సిబ్బంది విజయ రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



మేడిపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మేడిపల్లి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బండారి రవీందర్ సూచనలతో పార్టీ శ్రేణులు తెలంగాణ రాష్ట్ర దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మేడిపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నమో నారసింహ



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలోని మూలవిరాట్ శనివారం ఉగ్రనారసింహస్వామిగా పూజలందుకున్నాడు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు మాట్లాడుతూ దశావతారాల్లో క్షణికమైన అవతారాల్లో స్తంభంలో నుంచి ఉద్భవించిన ఉగ్ర నారసింహ అవతారం ఒక్కటన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు.

వల్వర్‌నగర్‌లో క్రీడాకారులకు హెల్త్‌క్యాంప్



కాప్రా: వల్వర్‌నగర్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సుమారు 100 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి సహకారమైనా అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఫుట్‌బాల్ కోచ్ శివకుమార్, ఇమ్మాన్యుల్, జాషువా, జానీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మల్లాపూర్: నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. నాచారం పారిశ్రామికవాడలోని ఎల్డొరదో అగ్రిటెక్ విత్తనాల తయారీ కేంద్రంలో రెవెన్యూ, పోలీసులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తనాల తయారీ ఉండాలని వ్యవసాయ అధికారిణి సుధారాణి సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ గంగాధర్‌రెడ్డి, లింగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉప్పల్ హైవేపై అల్లరి మూక వీరంగం

ఉప్పల్: ఉప్పల్‌లో శనివారం తెల్లవారు జామున గంజాయి బ్యాచ్ హల్‌చల్ సృష్టించింది. తాగిన బీరు బాటిల్స్ ఎత్తి అల్లరి మూక దాడులకు పాల్పడింది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. నాగోల్ సంగేరి కాలనీ ప్రాంతానికి చెందిన ఆదిత్య(24) తన మరో ఇద్దరు స్నేహితులు షామిక్, వంశీతో కలిసి శనివారం తెల్లవారు జామున ఉప్పల్ నాగోల్ రోడ్డులోని మాస్టర్ చెఫ్ హోటల్ వదకు టిఫిన్ కోసం వచ్చారు. ఇంతలోనే అక్కడే ఉన్న అల్లరి మూక మద్యం మత్తులో వీరిని బూతులు తిడుతూ గొడవ పడ్డారు. మరో వ్యక్తి చేతిలో ఉన్న బీరు బాటిల్‌ను పగుల గొట్టి ఆదిత్య కడుపులో, శరీరంపై పలుమార్లు దాడి చేసి పారిపోయారు. అడ్డుకోబోయిన ఆదిత్య స్నేహితులు సైతం గాయపడ్డారు. గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో నాచారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మేడిపల్లికి చెందిన తాడేం సాయికిరణ్(24), ఉప్పల్ గాంధీనగర్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్ అలియాస్ చిన్న(25), ఉప్పల్ హనుమసాయినగర్ ప్రాంతానికి చెందిన లంక నవీన్(23), ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన హనుమకొండ భరత్(23), ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీకి చెందిన బి.దిగంబర్(32)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృతి చెందిన శిశువు

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రానికి డెలివరి కోసం వస్తే డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నవజాత శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ శనివారం చిలుకానగర్‌కు చెందిన బాధిత కుటుంబ సభ్యులు ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వద్ద పసికందు మృతదేహంతో వచ్చి ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాలు.. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన వీరస్వామి భార్య మమతకు పురిటి నొప్పులు రావడంతో శనివారం తెల్లవారు జామున ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రానికి వచ్చింది. దీంతో డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు రజియా డాక్టర్ల సలహా మేరకు పురుడు పోయడంతో ఆడ శిశువు జన్మించింది. ఉదయం 4.30 వరకు బాగానే ఉన్న శిశువు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది రావడంతో వైద్య సిబ్బంది నిలోఫర్‌కు వెళ్లాలని సూచించారు. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే గంట సమయం పడుతుందని చెప్పడం, ప్రైవేటు వాహనంలో నిలోఫర్‌కు తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందిందని డాక్టర్లు చెప్పడంతో ఆగ్రహంతో కుటుంబ సభ్యులు శిశువుతో ఉప్పల్ ప్రాథమిక వైద్యకేంద్రానికి వచ్చి వైద్యులను నిలదీశారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

ఉప్పల్ వైద్యాధికారి సౌందర్య లత వివరణ...

మమత డెలివరి తర్వాత 2 నుంచి 3 గంటల వరకు శిశువు బాగానే ఉంది. సడన్‌గా బ్రీతింగ్ సమస్య రావడంతో అంబులెన్స్‌లో నిలోఫర్‌కు తీసుకెళ్లాలని వైద్య బృందం సూచించిందని, అయినా వారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లడం, అక్కడ నుంచి నిలోఫర్‌కు వెళ్లేసరికి ఆలస్యం అయ్యింది. పురుడు పోయడంతో తమ నిర్లక్ష్యం ఏమీ లేదంటూ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన ఐలయ్య(40) కారు డ్రైవర్. ఎస్పీనగర్‌లో ఐలయ్య అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని శ్రీధర్ వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించామని, కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని, భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.